సాక్షి

పశ్చిమగోదావరి

సోమవారం । 2 । జనవరి । 2023



వైభవంగా తిరుక్కోలం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : అగ్రహారంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్థన స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నాచ్చియార్ తిరుక్కోలం పూజలు నిర్వహించారు.



ముత్యాలమ్మ ఆలయంలో రద్దీ

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని శ్రీ బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



ముక్కోటి శోభ

పాలకొల్లు సెంట్రల్ : క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు రామాలయం తదితర ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనం నిమిత్తం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

డీఐజీ పాలరాజుకు ఐజీగా పదోన్నతి



ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజుకు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఏలూరు రేంజ్ డీఐజీ కార్యాలయంలో ఐజీగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు ఉత్తమ సేవలు అందించటమే పోలీస్ విధుల్లో ప్రధానమైందని, ప్రజలకు రక్షణ కల్పిస్తూ వారి సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పోలీస్ అంటే ప్రజల్లో గౌరవ భావం ఏర్పడేలా చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు. ఐజీగా పదోన్నతి పొందిన పాలరాజును జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ కలిసి అభినందనలు తెలిపారు.

పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు



భీమవరంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్స్(ఐరిష్) స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం ప్రారంభించారు. మంగళవారం నుంచి ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐరిష్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు తీసుకోనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఎస్ఎస్ పాల్, పి.సీతారామరాజు చెప్పారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు పొందడానికి ఆధార్ నంబరు, పిపిఓ నంబరు, బ్యాంకు అకౌంట్ నెంబరు, ఒటిపి కోసం సెల్‌ఫోన్ తీసుకొని రావాలని తెలిపారు.

పోక్సో కేసు నమోదు

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్‌కు చెందిన 11 ఏళ్ల బాలికపై ఉండి మండలం మహాదేవపట్నం గ్రామానికి చెందిన బండి రాంబాబు అనే 47 ఏళ్ల వ్యక్తి అత్యాచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. డిసెంబర్ 31న బాలిక ఒంటరిగా ఉండగా రాంబాబు అత్యాచారానికి పాల్పడినట్లు అందిన ఫిర్యాదు మేరకు సీఐ అడబాల శ్రీను పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టెండర్ల ఆహ్వానం

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పేషెంట్స్‌కు భోజనం సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత దరఖాస్తు ఫారాలు ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పటల్ సర్వీసెస్ కార్యాలయంలో ఈ నెల 2 నుంచి 7 వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ఇతర వివరాలకు జిల్లా కో-ఆర్డినేటర్ ఆఫ్ హాస్పటల్ సర్వీసెస్ ఏలూరు కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.



సీఎంకు శుభాకాంక్షలు

నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు ఆదివారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరిలో ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కూడా ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి, భీమవరం



నిత్యాన్నదాన భవనంలో ప్రారంభోత్సవాలు

ద్వారకాతిరుమల : శ్రీవారి కొండపైన వకుళ మాత నిత్యాన్నదాన భవనం వద్ద వర్మికం పోస్టు తయారీ మెషిన్‌ను ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు ఆదివారం ప్రారంభించారు. దాంతో పాటు అన్నప్రసాదాన్ని స్వీకరించే భక్తుల ఫేస్‌లను స్కానింగ్ చేసే సిస్టం, నూతన ఎలక్ట్రికల్ బాయిలర్, స్టీల్ ప్లేట్లు క్లీన్ చేసే మెషిన్, ఎలక్ట్రికల్ గ్యాస్ బాయిలర్ సిస్టమ్‌లను ఆయన రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం వాటి వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీవీ భాస్కర్, ఏఈఓలు పి.నటరాజారావు, కేవీఎస్ రాజు తదితరులున్నారు.

కొత్త ఏడాదిలో పింఛన్ పండుగ

రూ.250 పెంపుతో రూ. 2750కి పెరిగిన పెన్షన్

- ఆదివారం తెల్లవారుజాము నుంచే అందజేత
- రూ.250 పెంపుతో రూ. 5.97 కోట్లు అదనపు లబ్ధి

భీమవరం(ప్రకాశం చౌక్): కొత్త సంవత్సరం అవ్వాతాతల మోములో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత సంతోషాన్ని నింపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ నూతన సంవత్సర కానుకగా పెంచిన పెన్షన్‌ను అందించారు. పండుగ వాతవారణంలో లబ్ధిదారులకు పెంచిన పెన్షన్ అందించి వారి సంతోషాన్ని రెట్టింపు చేశారు. జిల్లా వ్యాప్తంగా పెంచిన పెన్షన్‌ను ఆదివారం తెల్లవారుజాము నుంచి అందచేశారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, సచివాలయం కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం 80 శాతం మేర పెన్షన్లు పంపిణీ చేశారు. జిల్లాలో కొత్తగా 8,873 పెన్షన్లు మంజూరు చేయగా మొత్తం పెన్షన్ల సంఖ్య 2,22,974కి చేరింది. గతేడాది డిసెంబరు నాటికి 2,18,242 పెన్షన్లు పంపిణీ చేశారు.



భీమవరం మండలం తాడేరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇచ్చిన మాటకు కట్టుబడి..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్ రూ 2 వేలు నుంచి రూ 3 వేల వరకు పెంచుతానని ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతున్నారు. ఇప్పటికే 2 వేల నుంచి రెండు దఫాలుగా పెంచి గతేడాది డిసెంబరు వరకు రూ.2500 పెన్షన్ అందించారు. ఇప్పుడు మరో రూ.250 పెంచి పెన్షన్ రూ.2750 చేశారు.



భీమవరం 39వ వార్డులో పెన్షన్ అందజేస్తున్న సచివాలయం సిబ్బంది

జిల్లాలో ప్రస్తుతం రూ.60.84 కోట్ల చెల్లింపు

పశ్చిమగోదావరి జిల్లాలో గతేడాది డిసెంబరు నాటికి 2,18,242 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. వారికి రూ.54.87 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. తాజాగా ప్రభుత్వం పెన్షన్‌ను రూ.250 పెంచి రూ.2500 నుంచి రూ.2750 చేయడంతో జనవరి నుంచి 2,22,974 మందికి గాను ప్రభుత్వం అదనంగా మరో రూ.5.97 కోట్లు చెల్లిస్తున్నారు. దాంతో మొత్తం జిల్లాలోని లబ్ధిదారులకు జనవరి నెలలో రూ.60.84 కోట్లను ప్రభుత్వం పెన్షన్లకు ఖర్చు చేసింది. పెంచిన పెన్షన్ లబ్ధిదారుల్లో భారీగా ఖర్చు చేసేది వృద్ధాప్య పింఛన్లకే.. జిల్లాలో అన్ని రకాల పింఛన్లు 2,22,974 మంది ఉంటే అందులో సుమారు 1,23,777 మంది లబ్ధిదారులు వృద్ధాప్య పింఛన్‌దారులే.

తెల్లవారుజాము నుంచే పంపిణీ



ప్రభుత్వం పెంచిన రూ.250తో కలిపి రూ.2750 పెన్షన్ ఆదివారం తెల్లవారుజాము నుంచే జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేశాం. వలంటీర్లు, సచివాలయం సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ అందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ సూచనలు, సలహాలు తీసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్లు అందిస్తున్నాం. 7 తేదీ వరకు పెన్షన్ అందిస్తాం.

– ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఆర్‌డీ పీడీ భీమవరం

పెన్షన్ మొత్తం పెంచడం ఆనందదాయకం



ముఖ్యమంత్రి మాకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచి ఇవ్వడం సంతోషంగా ఉంది. ఇప్పటికే రెండు సార్లు రూ.250 చొప్పున పెంచారు. మళ్లీ కొత్త సంవత్సరం కానుకగా రూ.250 పెంచి రూ.2750 పెన్షన్ తెల్లవారుజామునే అందుకోవడం ఆనందంగా ఉంది.

– లంకపల్లి పార్వతీ, లబ్ధిదారురాలు, భీమవరం

మా కష్టాలు తెలుసుకుని..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వృద్ధుల కష్టాలు తెలుసుకుని పెన్షన్ పెంచుకుంటూ వెళ్తున్నారు. ఈ నెల రూ.2,750 పెన్షన్ తెల్లవారుజామునే అందుకోవడం సంతోషంగా ఉంది.

– కె.నర్సింహమూర్తి, భీమవరం







తాడేపల్లిగూడెంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు, తణుకులో కేక్ కట్ చేస్తున్న మంత్రి కారుమూరి, భీమవరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

నూతన సంవత్సర సంబరాలు

తణుకు అర్బన్: కొత్త సంవత్సరం ప్రజలందరికీ మంచి జరగాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. నూతన సంవత్సర వేడుకను ఆదివారం తణుకులో మంత్రి కారుమూరి నివాస ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాల్లోనూ సుఖసంతోషాలు విరజిల్లాలని అన్నారు. అనంతరం కేకు కట్ చేశారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి సుబ్బారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో

భీమవరం(ప్రకాశం చౌక్): ఆదివారం పెద అమిరంలోని కలెక్టరు క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఎస్పీ యు.రవిప్రకాష్, జాయింటు కలెక్టర్ జేవీ మురళి, రెవిన్యూ అధికారి దాసిరాజు, జిల్లా అధికారులతో కలిసి కలెక్టరు కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. పలువురు ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, అధికారులు, కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రైతు బజారు సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం, వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో కలసి కలెక్టరు పి.ప్రశాంతి నూతన సంవత్సర వేడుకలు చేసుకున్నారు. కేకు కట్ చేసి విద్యార్థినులకు తినిపించారు. పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్ అందజేశారు. జాయింటు కలెక్టరు క్యాంప్ కార్యాలయం, బంగ్లా ఆఫీసు కార్యాలయంలో నూతన సంవత్సర సందర్భంగా ఇన్‌చార్జి డీఆర్వో దాసి రాజు, జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి జాయింట్ కలెక్టరు జేవీ మురళి భారీ కేక్ కట్ చేశారు. 2023 సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు కలగాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆకాంక్షించారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆదివారం పలువురు నాయకులు, కార్యకర్తలు మంత్రి కొట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆక్వా తవ్వకాలకు అడ్డుకట్ట

- నాన్ ఆక్వాజోన్‌లో చెరువులకు అనుమతుల నిరాకరణ
- ఆక్వా జోన్ పరిధిలో ఉంటేనే గ్రీన్ సిగ్నల్
- ఈ నెల 5 వరకు ఆక్వా జోన్ రీసర్వే

సాక్షి, భీమవరం: జిల్లాలో విచ్చలవిడిగా చెరువుల తవ్వకానికి అడ్డుకట్ట పడనుంది. నాన్ ఆక్వాజోన్ పరిధిలోని భూములకు అనుమతిచ్చేది లేదని మత్స్యశాఖాధికారులు స్పష్టం చేశారు. చెరువుల తవ్వకానికి అనుమతిచ్చే ఇచ్చేముందు తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తామని స్పష్టం చేస్తున్నారు.

డాలర్ల పంట పండిస్తున్న రొయ్యల సాగుకు జిల్లాలో రైతులతోపాటు కొన్ని కార్పొరేట్ సంస్థలు ఉత్సాహం చూపుతున్నాయి. బడాబాబులు సిండికేట్‌గా ఏర్పడి వందలాది ఎకరాల భూములను లీజుకు తీసుకుని ఆక్వా సాగుచేస్తున్నారు. దీంతో నీటి కాలుష్యం పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రొయ్యల చెరువుల సమీపంలోని పంట భూములు ఉప్పునీటి కయ్యలుగా మారుతున్నాయి. వరి పండించే అవకాశం లేకపోవడంతో అనేకచోట్ల నిరుపయోగంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో అనేక ఫిర్యాదులు రావడంతో నాన్ ఆక్వాజోన్ పరిధిలోని భూములకు ఎట్టి పరిస్థితిలోను ఆక్వా సాగుకు అనుమతి ఇచ్చేదిలేదంటూ మత్స్యశాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు.



భీమవరం మండలంలో రొయ్యల చెరువు దృశ్యం

గ్రామసభ అనుమతి తప్పనిసరి

జిల్లాలో సుమారు 1.20 లక్షల ఎకరాల్లో ఆక్వాసాగు చేస్తుండగా దానిలో ఎక్కువశాతం రొయ్యలు పెంచుతున్నారు. రొయ్యల సాగుకు అనుమతిలేని ప్రాంతాల్లో సైతం కొంతమంది రైతులు చేపల సాగుపేరుతో చెరువులు తవ్వి అక్రమంగా రొయ్యల సాగు చేయడం పరిపాటిగా మారింది. రొయ్యల సాగు విస్తృతంగా పెరగడంతో ఇటీవల ధరలు పతనమై అనేకమంది తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టడంతో రొయ్యల ధరలు పెరగడం, మేతలు, సీడ్ ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇలాంటి పరిస్థితిలో చెరువుల తవ్వకానికి నిబంధనలు కఠినతరం చేయడం వల్ల రైతులు నష్టపోకుండా ఉంటారని భావించిన అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 5వ తేది వరకు ఆక్వా జోన్ రీసర్వే చేస్తున్నందున ఇప్పటికే చెరువులున్న రైతులు తమ భూముల సర్వే నెంబర్లు జోన్ పరిధిలో ఉన్నవి లేనిది తెలుసుకుని జోన్ పరిధిలో లేకుంటే చేర్చేందుకు సంబంధిత అధికారులకు 1బీ కాపీ ఇవ్వాల్సివుంటుంది. నిబంధనలకు అనుగుణంగా భూములున్న రైతులు తమ భూములను చెరువులుగా మార్పు చేసుకోవాలనుకుంటే ఆక్వాజోన్ పరిధిలో పెట్టుకుంటేనే చెరువులకు అనుమతిస్తారు. కొత్తగా చెరువులు తవ్వే రైతులు తమ భూములకు సాగునీటి సరఫరా, మురుగునీటి పారుదలకు అవకాశం ఉండడమేగాక భూముల చుట్టూ కనీసం 60 శాతం చెరువులుంటేనే ఆక్వాజోన్ పరిధిలోనికి తీసుకుంటారు. గ్రామసభ నిర్వహించి చుట్టుపక్కల రైతులకు అభ్యంతరాలు లేకుంటేనే అనుమతి ఇస్తారు. దీంతో విచ్చలవిడిగా చెరువుల తవ్వకానికి అడ్డుకట్ట పడుతుందని మత్స్యశాఖాధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం చెరువులు తవ్విన రైతులకు మాత్రమే ప్రభుత్వ రాయితీలు అందించే అవకాశం ఉండడంతో రైతులు తప్పనిసరిగా ఆక్వాజోన్ పరిధిలోనికి వచ్చే భూములను మాత్రమే చెరువులుగా మార్చడం వల్ల పర్యావరణ ఇబ్బందులు ఏర్పడవని ప్రజలు చెబుతున్నారు.

నిబంధనలు పాటిస్తేనే చెరువులకు అనుమతి



నాన్ ఆక్వా జోన్ పరిధిలో చెరువుల తవ్వకానికి ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఉండవు. ఈ నెల 5 వరకు రీ సర్వే జరుగుతుంది. వ్యవసాయ భూములను చెరువులుగా మార్పు చేసుకోవాలంటే ఆక్వాజోన్‌లో పెట్టుకుని అనుమతులు పొందాలి. ఆక్వా చెరువులకు ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లతోపాటు చుట్టుపక్కల భూముల్లో ఎక్కువశాతం చెరువులు తప్పనిసరిగా ఉండాలి. నిబంధలను పాటించకుంటే చెరువుల రైతులకు ఇబ్బందులు తప్పవు.

ఎల్ఎల్ఎన్ రాజు,
మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, భీమవరం

రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తాం

కలెక్టర్ పి.ప్రశాంతి



భీమవరం (ప్రకాశం చౌక్): కొత్త సంవత్సరంలో జిల్లా యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తామని, జిల్లా అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడుతూ 2023లో ప్రత్యేక ప్రణాళిక ప్రకారం వివరాలు తెలియజేశారు. మహిళల, శిశు సంరక్షణ, వారి ఆరోగ్యం గురించి ప్రత్యేక కార్యచరణ అమలు, ఎన్జీవోలు, కార్పొరేట్ సంస్థలను నాడు నేడు అభివృద్ధి పనుల్లో భాగసాముల్ని చేయడం, గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయించడం, ఈ పండగ నెలలో ఎక్కువ గృహప్రవేశాలు చేయించడానికి చర్యలు తీసుకుంటుమని చెప్పారు. తాగునీటి సరఫరా కోసం చేస్తున్న జలజీవన్ మిషన్ పనులు వేగంగా పూర్తి చేయడానికి, రెండు పంటలకు సంబంధించి సాగునీటి ఎద్దడి లేకుండా పుష్కలంగా అందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఆక్వాకు మార్కెటింగ్ సంబంధించి అవుట్ లెట్‌ల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తుమన్నారు. డ్వాక్రా సంఘాల ఆర్థిక పరిపుష్టికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి ఆ దిశగా వ్యాపారాల్లో రాణించేలా పనిచేస్తున్నామన్నారు. విద్యకు మరింత ప్రాధాన్యత ఇచ్చి పాఠశాల స్థాయి నుంచి కళాశాల వరకు విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందిస్తున్న ప్రోత్సాహకాలు పారదర్శంగా అందిస్తామని చెప్పారు. జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడం, అవసరమైన అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చుకుని పనులు చేపట్టడం చేస్తామన్నారు.

సజావుగా ధాన్యం సేకరణ

ఏలూరు(మెట్రో): జిల్లాలో పారదర్శకతతో ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ వి.ప్రసన్నవెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వచ్చిన పౌర సరఫరాల అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంతవరకు 39,379 మంది రైతుల నుంచి రూ.566 కోట్ల విలువైన 2,76,898 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. జిల్లాలో పారదర్శకతతో నూతన విధానంలో ధాన్యం కొనుగోలు చేశామన్నారు. తొలుత పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు మంజూ భార్గవి, డీఎస్ఓ ఆర్. సత్యనారాయణరాజు, పలువురు పౌర సరఫరాల సంస్థ సిబ్బంది ప్రసన్న వెంకటేష్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

క్లుప్తంగా

సావిత్రిబాయి పూలే అవార్డుకు శైలజ ఎంపిక


ఉపాధ్యాయిని దాసరి శైలజ (ఫైల్)

ముసునూరు: సావిత్రిబాయి పూలే అవార్డుకు ముసునూరు హైస్కూల్ ఉపాధ్యాయురాలు దాసరి శైలజ ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.శ్రీనివాస్ ఆదివారం చెప్పారు. తమ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న దాసరి శైలజ ఉమ్మడి కృష్ణా జిల్లా తరుపున సావిత్రిబాయి పూలే ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల మూడో తేదీన తిరుపతిలోని ఆఫీసర్స్ కల్చరల్, సోషల్ క్లబ్‌లో జరగనున్న కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ఈ అవార్డు స్వీకరిస్తారని వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని శైలజకు పలువురు అభినందనలు తెలిపారు.

దుకాణంలో చీరను దొంగిలిస్తూ చిక్కిన మహిళ

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో చీరను దొంగిలిస్తూ ఓ మహిళ పట్టుబడింది. వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం వన్‌టౌన్‌లోని ఒక చీరల దుకాణంలో చీరలు కొనుగోలు చేయడానికి శనివారం రాత్రి వచ్చిన ఓ మహిళ చీరను దొంగిలిస్తూ పట్టుబడగా, దుకాణ మేనేజర్ కె.పరుశురామయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టుబడిన మహిళతో పాటు మరికొందరు తప్పించుకుని ఆటోలో వెళ్లిపోయినట్లు దుకాణ మేనేజర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవిందా.. హరి గోవిందా

- క్షేత్రంలో వైభవంగా శ్రీవారి గిరి ప్రదక్షిణ
- వేలాదిగా పాల్గొన్న భక్తులు, గోవింద స్వాములు
- ఆకట్టుకున్న కోలాట భజనలు, గజ, అశ్వ సేవలు


ధర్మప్రచార రథంలో కొలువైన శ్రీవారు


శ్రీ వేంకటేశ్వర స్వామివారి నాటక ప్రదర్శన


గిరి ప్రదక్షిణలో ఇరుముడులతో గోవింద స్వాములు


కోలాట నృత్యాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి గిరి ప్రదక్షిణతో ద్వారకాతిరుమల క్షేత్రం పులకించింది. ఎటు చూసినా భక్తజన సంద్రమే. ఏ నోట విన్నా గోవింద నామస్మరణలే. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, గజ, అశ్వ, వృషభ సేవలు నడుమ ఆదివారం సాయంత్రం జరిగిన ఈ వేడుక ఆద్యంతం నేత్రపర్వంగా సాగింది. తొలుత ఆలయ ప్రధాన కూడలిలో స్వామివారి ధర్మ ప్రచార రథాన్ని ఉంచి సుగంధభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. రథంలో కొలువు తీరిన స్వామివారికి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు విశేష పూజలు నిర్వహించారు. తరువాత వారు జెండాను ఊపి రథాన్ని ప్రారంభించారు. స్వామివారి వైభవాన్ని చాటుతూ గజలక్ష్మి, రెండు అశ్వాలు, వృషభాలతో పాటు చిత్రవిచిత్ర వేషధారణలు, కోలాట భజనలు, డప్పు వాయిద్యాలు, శ్రీ వేంకటేశ్వరస్వామివారి నాటిక ప్రదర్శనలు, కోలాట నృత్యాలు జరిపారు. అలాగే రథం వెనుక వేలాది మంది భక్తులు, గోవిందస్వాములు, వారి బంధువులు గోవిందా.. గోవిందా.. అంటూ పాదయాత్రగా ఐదు కిలోమీటర్ల మేర గిరి చుట్టూ తిరిగారు. దాతల సహకారంతో మార్గమధ్యలో దేవస్థానం వారు భక్తులకు పలు రకాల పండ్లు, పాలు, టీ, మంచినీటిని అందించారు. ఈ గిరి ప్రదక్షిణ యాత్ర క్షేత్రం నుంచి దొరసానిపాడు, రాళ్లకుంట రహదారి మీదుగా కొండపైకి, అక్కడి నుంచి ఉగాది మండపం మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. ఎంతో అట్టహాసంగా, ఆడంబరంగా, వైభవోపేతంగా జరిగిన ఈ వేడుక భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీవీ భాస్కర్, ఏఈఓలు మెట్టపల్లి దుర్గారావు, కేఎల్ఎస్ రాజు, సూపరింటెండెంట్లు వాసు, రమణరాజు, జీవీ సత్యన్నారాయణ, సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.


గిరి చుట్టూ తిరుగుతున్న శ్రీవారి ధర్మప్రచార రథం


శ్రీవారి ధర్మప్రచార రథంలో కొలువైన స్వామివారు


గిరి ప్రదక్షిణను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ త్రినాథరావు, అనువంశిక ధర్మకర్త నివృతరావు


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులతో కిక్కిరిసిన రహదారి


గిరి ప్రదక్షిణలో గజలక్ష్మి

సాక్షి క్లాసిఫైడ్స్

REALSTATE

FLAT FOR SALE

■ భీమవరం టౌన్ రైల్వేస్టేషన్, నూతనంగా నిర్మించిన 2వ ప్లాట్ ఫారం టికెట్ కౌంటర్ దగ్గరలో గల 4.5 సెంట్లు మరియు డి.మార్ట్ రోడ్‌లోగల 5 సెంట్లు స్థలం అమ్మబడును. సంప్ర: 9948754306 [P-1213068]

HOUSE FOR SALE

■ ఏలూరు పవర్‌పేట 342 చ.గ.లలో అన్ని వసతులతో ఉన్న పెంకుటిల్లు అమ్మబడును. సంప్ర : 9491252380. [H-792765]

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకుల్లో, ప్రైవేట్ సంస్థల్లో తనఖాలో ఉన్నవి విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువుతో, తనఖా ఇవ్వబడును. ✆ : 81795 84939 [R-5467]

■ సంప్ర: సెల్: 79977 89771 బంగారం బ్యాంకు లలో, ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్. [B-917]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786654]

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888 [B-1197719]

BUSINESS OFFER

■ Apes Group కంపెనీ ప్రొవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం కమీషన్, ✆ 9667730921. [T-1159685]

జ్యోతిష్యాలయం

■ కేరళ దుర్గా భవాని జ్యోతిష్యం పండిత్ వి. కృష్ణ స్వామీ మీ జీవితంలోని ఎలాంటి కఠిన నిఘూఢ గుప్త (స్త్రీ.పు) వశీకరణం ఏ రకమైన సమస్యలకు. కేరళ మాంత్రిక విద్య నుంచీ శాశ్వత పరిష్కారం. 9632533154 [Y-708945]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటిదగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్ టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776241]

■ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో పర్యవేక్షణకు కార్గో సూపర్వైజర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్స్, లోడర్స్, సెక్యూరిటీగార్డ్స్ కావలెను. జీ: 21,000/- to 30,000/- రూం+మీల్స్ ఫ్రీ Q: 5th to డిగ్రీ. 8886186894 [H-778949]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉత్తర ద్వార దర్శనానికి సర్వం సిద్ధం

నేడు తెల్లవారుజామున 5 గంటల నుంచి శ్రీవారి సర్వదర్శనం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి సర్వం సిద్ధమైంది. సోమవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉత్తర ద్వారం వద్ద స్వామివారి దర్శనం భక్తులకు కల్పించనున్నట్లు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు ఆదివారం చెప్పారు. దాతల సహకారంతో ఆలయ పరిసరాలను, ఉత్తర ద్వారాన్ని ఆదివారం పచ్చిపూలతో శోభాయమానంగా అలంకరించారు. ఉత్తర ద్వారంలో స్వామివారు ఆశీనులయ్యే ప్రాంతాన్ని అలంకరించి ప్రత్యేక మండపాన్ని నిర్మించారు. పలు ఆకృతుల్లో పచ్చిపూలతో ఆలయ ప్రధాన మార్గాల వద్ద అలంకరించారు. అర్ధరాత్రి వరకు ఈ పనులు సాగాయి. అలాగే స్వామివారి వాహన సేవకు వెండి గరుడ, శేష వాహనాలను సిద్ధం చేశారు.

క్షేత్రానికి చేరుకున్న గోవిందస్వాములు

ముక్కోటినాడు తొలిదర్శనం చేసుకోవాలన్న ఆకాంక్షతో దూరప్రాంతాలకు చెందిన కొందరు గోవిందస్వాములు ఆదివారం రాత్రి ఆలయానికి చేరుకున్నారు. వారంతా గిరి ప్రదక్షిణ భక్తులతో కలసి స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్నారు. సోమవారం ఉదయం ఇరుముడులను సమర్పించనున్నారు.


శ్రీవారి ఆలయంలో స్వామివారు ఆశీనులయ్యే ఉత్తర ద్వార ప్రాంతాన్ని ముస్తాబు చేస్తున్న సిబ్బంది



కొండపైన పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ముఖద్వారం

బావిలోకి దూకి వృద్ధురాలి ఆత్మహత్య

లింగపాలెం: మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం ఈ ఘటన జరగగా, ఆదివారం బావి నుంచి వృద్ధురాలి మృతదేహాన్ని బయటకు తీశారు. ధర్మాజీగూడెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బద్దారపు శాంతమ్మ (60) గత కొంత కాలంగా అనారోగ్యంతో, మతిస్థిమితం లేక బాధపడుతోంది. శనివారం ఆమెను భర్త సూరయ్య బైక్‌పై రంగాపురం హాస్పిటల్‌కు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మంచినీరు తాగేందుకు శాంతమ్మ బైక్ దిగి దారి పక్కనే ఉన్న పురాతన బావిలోకి దూకి ఆత్యహత్య చేసుకుంది. ఆదివారం స్థానిక పోలీసులు, చింతలపూడి అగ్నిమాపక సిబ్బంది బావిలో సుమారు 100 అడుగుల లోతులో ఉన్న నీటిని రెండు మోటర్లతో బయటకు తోడి ఊబిలో ఇరుక్కున్న మృతదేహాన్ని హోంగార్డు సూరిబాబు బయటకు తీసుకువచ్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ఎస్సై చెన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బావిలో నుంచి మృతదేహాన్ని తీసుకొస్తున్న హోంగార్డు , శాంతమ్మ మృతదేహం

ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం.. యువకుడిపై కేసు

బుట్టాయగూడెం: ప్రయాణిస్తున్న బస్సును అడ్డుకుని ఓ యువకుడు దౌర్జన్యం చేయడమే కాక అద్దాలను పగలుకొట్టాడంటూ బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్ ఆదివారం జంగారెడ్డిగూడెం నుంచి జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెంకు ప్రయాణికులతో వెళుతోంది. అంతర్వేదిగూడెం సమీపంలోకి వచ్చేసరికి అదే గ్రామానికి చెందిన లక్ష్మణరావు అనే యువకుడు గ్లామర్ బండిపై వేగంగా వచ్చి బస్సును ఆపి బస్సు ముందు ఉన్న రెండు అద్దాలను పగలకొట్టాడు. అంతేకాక దౌర్జన్యం చేసి తన విధులకు ఆటంకం కలిగించి ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశాడంటూ డ్రైవర్ ఎం.బాబూరావు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు చెప్పారు. ఇదిలా ఉండగా, ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


యువకుడి దాడిలో పగిలిన ఆర్‌టీసీ బస్సు అద్దాలు

ప్రజల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ధ్వజం

ఉంగుటూరు: చంద్రబాబు ఎక్కడ పాదం పెడితే అక్కడ వినాశనం జరుగుతోందని, ఈ నేపథ్యంలో ఆయన పాదం ఎక్కడ మోపకుండా హైదరాబాదులో విశ్రాంతి తీసుకుంటే మేలని రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి ఉంగుటూరు మండలం గోపినాథపట్నం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గుంటూరులో జనతా వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఇరుకు సందులో పెట్టి ప్రజలు తొక్కిసలాడుకునేచేసి ముగ్గురు చనిపోవడానికి చంద్రబాబు కారణమయ్యారని అన్నారు. ఈ కార్యక్రమానికి కొద్ది మంది ప్రజలే వచ్చినా చంద్రబాబు కోసం ఎక్కువమంది వస్తున్నట్లు చూపించేందుకు ఇరుకైన సందులు వెతుక్కుని కార్యక్రమాలు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న విషయాన్ని ప్రజలు గ్రహించాలని అన్నారు. ప్రజల్లో విలువ తగ్గిపోయిందని తెలిసి కూడా ఈ రకంగా చంద్రబాబు వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. చంద్రబాబు ఎక్కడ లెగ్ పెడితే అక్కడ జనం చచ్చిపోతున్నారని మంత్రి కొట్టు ఎద్దేవా చేశారు. రాజకీయాలకు చంద్రబాబు పనికిరాడని ప్రజలు భావిస్తున్నారన్నారు. నోరు విప్పితే ఏమి మాట్లాడుతున్నాడో చంద్రబాబుకే తెలియడం లేదని, మతి భ్రమించినట్టు మాట్లాడతున్నారని కొట్టు విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు చాలా సంతోషంగా ఉంటే చంద్రబాబు తాను ఏదో చేస్తానంటూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. సచివాలయ ఉద్యోగులు, ఇతరులు కొన్నివర్గాల ఆదాయాలు పెరిగాక రేషన్ కార్డులు విచారణ చేస్తుంటే, ప్రభుత్వం వారి కార్డులు రద్దు చేయకుండానే రద్దు చేశారని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.


గోపినాథపట్నంలో విలేకరులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యానారాయణ

కొత్త ఏడాది మరిన్ని విజయాలకు నాంది కావాలి


నూతన సంవత్సర వేడుకల్లో జేసీ అరుణ్‌బాబు

ఏలూరు (మెట్రో): కొత్త ఆశలు ఆశయాలతో నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ మరిన్ని విజయాలకు నాంది కావాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం తన ఛాంబర్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. డీఆర్వో ఏవీఎస్ఎన్ మూర్తి, కలెక్టరేట్ ఏఓ రమాదేవి, పలు సెక్షన్ల అధికారుల సమక్షంలో జేసీ కేకును కట్ చేశారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది జేసీకి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు శ్రీనగర్ కాలనీలో చోరీ

రూ.40 వేల నగదు, 3 కాసుల బంగారం, కిలోన్నర వెండి అపహరణ

ఏలూరు టౌన్: ఏలూరు దొండపాడు శ్రీనగర్ కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు బెడ్‌రూమ్ కిటికీ ధ్వంసం చేసి ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వెండి, నగదును అపహరించారు. ఈ మేరకు బాధితులు ఏలూరు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి. దొండపాడు శ్రీనగర్‌కాలనీలో నివాసం ఉంటోన్న శ్రీనివాస సుబ్రహ్మణ్యం ఒక ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. తండ్రి సూర్యనారాయణను శస్త్రచికిత్స నిమిత్తం గత ఏడాది డిసెంబర్ 20న విజయవాడ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. తిరిగి డిసెంబర్ 31న రాత్రి 11 గంటలకు ఇంటికి తిరిగి వచ్చారు. తాళాలు తీయగా తలుపులోపల గడియ పెట్టినట్లు ఉండగా, వెనుకవైపు వెళ్లి చూడగా బెడ్‌రూమ్ కిటికీ తెరిచి ఉంది. చోరీ జరిగిందనే అనుమానం రావటంతో త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం పోలీసులు క్లూస్‌టీంతో వచ్చి ఇంట్లో ఆధారాలు సేకరించారు. రెండు బెడ్‌రూమ్స్‌లోని రెండు బీరువాలు పగులగొట్టి ఉండడం, వాటిలోని రూ.40 వేల నగదు, 3 కాసుల బంగారు ఆభరణాలు, సుమారు కిలోన్నర వెండి వస్తువులు, లాప్‌టాప్, టీవీ అపహరణకు గురైనట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఇంట్లో చెల్లాచెదురుగా ఉన్న వస్తువులు

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

చింతలపూడి: కుటుంబ తగాదాల నేపథ్యంలో ఓ వివాహిత చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని శివపురం గ్రామానికి చెందిన డి.లక్ష్మి పద్మావతి (40) శనివారం నుంచి కనిపించడం లేదు. అయితే ఆదివారం మర్రిబంధం గ్రామంలో చెరువులో పద్మావతి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని, భర్త వేధింపులు తట్టుకోలేకే పద్మావతి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని గ్రామస్తులు చెబుతున్నారు. ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూత కనిపించదేం?

పాడి - పంట

- అదను దాటుతున్నా కానరాని పూత
- ఆందోళనలో మామిడి రైతులు
- దిగుబడిపై ప్రభావం చూపుతుందని దిగులు

ఆగిరిపల్లి: అదను దాటుతున్నా మామిడి చెట్లకు పూత కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా సకాలంలో వచ్చే పూత ఈ ఏడాది ఇంకా కానరాకపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపుతుందని కలవరపడుతున్నారు. మండలంలోని 25 గ్రామాల్లో అత్యధిక విస్తీర్ణంలో మామిడి తోటలు ఉన్నాయి. మండలంలో ఎక్కువగా మెట్ట భూములు ఉండటంతో రైతులు పూర్వం నుంచి మామిడి తోటలపైనే ఆధారపడుతున్నారు. మండలంలో సుమారు 25 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. సాధారణంగా నవంబర్ నెలాఖరులో మామిడి చెట్లకు పూత వస్తుంది. ఫిబ్రవరిలో పిందెలు ఏర్పడతాయి. గత మూడేళ్లుగా నవంబరు నెలలో పూత ఆశాజనకంగా వచ్చిన దాఖలాలు లేవు. ఈ ఏడాది వర్షాలు బాగా పడటంతో మామిడి పంట ఆశాజనకంగా ఉంటుందని రైతులు తొలుత భావించారు. అయితే ప్రతి ఏడాది వడ్లమాను, కొత్త ఈదర తదితర గ్రామాల్లోని మామిడి తోటల్లో పూత వచ్చేది. కానీ ఈ ఏడాది భిన్నంగా ఈ గ్రామాల్లో కూడా మామిడి తోటల్లో పూత లేదు. పూత రావడానికి ఫిబ్రవరి మొదటి వారం వరకు అవకాశం ఉందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.


ఎస్‌ఏ పేట సమీపంలో మామిడి తోట

సరైన వేళ కాయలు చేతికి రావు



మామిడి తోటల్లో పూత ఆలస్యమైతే దిగుబడిపై ప్రభావం చూపుతుంది. పూత ఆలస్యమైతే కాయలు సరైన సమయంలో చేతికి వచ్చే పరిస్థితి ఉండదు. ప్రస్తుతం జనవరి నెలాఖరు వరకు మామిడి తోటల్లో పూతపై ఆశలు సజీవంగా ఉన్నాయి.

– మచ్చా హరిబాబు, మామిడి రైతు

తేమ వల్లే ఆలస్యం



ఈ ఏడాది మండలంలో అధిక వర్షాల వల్ల భూమిలో తేమశాతం ఎక్కువగా ఉంది. ఇది మామిడి పూతపై ప్రభావం చూపుతుంది. పూత వచ్చేందుకు పొటాషియం నైట్రేట్ 10 గ్రాముల మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– పలగాని చెన్నారావు, ఏఓ, ఆగిరిపల్లి

క్లుప్తంగా

ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్‌గా పొట్ల సురేష్



తణుకులో పొట్ల సురేష్‌ను అభినందిస్తున్న మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్‌గా న్యాయవాది పొట్ల సురేష్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ప్రకటించారు. దళితులందరినీ ఏకతాటిపైకి తీసుకు వచ్చి పార్టీకి అండగా నిలబడాలని సురేష్‌కు మంత్రి కారుమూరి సూచించారు.

ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మిచే ఆదివారం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఆమె మాట్లాడుతూ సేవా భావంతో మరిన్ని సేవలు అందిస్తామన్నారు. పార్వతి, కనకదుర్గ, ప్రభావతి, రామకృష్ణ, రామ్మోహన్‌రావు, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తణుకు అర్బన్: ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులంతా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని డీఈవో ఆర్.వెంకటరమణ అన్నారు. తణుకులో ఆదివారం ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆయన చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి అయినపర్తి రాజగోపాల్, జిల్లా కార్యదర్శి వేంద్ర రామమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు అల్లం వీరభద్రరావు, రాష్ట్ర కౌన్సిలర్ కోట రామప్రసాద్, తణుకు మండల నాయకులు ఎస్.జయరాజు, ఇంటి ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పొడిగించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పొడిగించాలని కోరుతూ బ్యాక్ వర్డ్ అండ్ మైనార్టీస్ కమ్యూనిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (బామ్‌సెఫ్) నాయకులు ఆదివారం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ నివాసం వద్ద ఆయనకు వినతిపత్రం అందజేశారు. బామ్‌సెఫ్ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఏపీ శాసన సభ 2013 జనవరిలో చట్టాన్ని ఆమోదించిందని తెలిపారు. సబ్ ప్లాన్‌లో భాగంగా జనాభా ప్రాతిపదికపై ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో 15.7 శాతం నిధులు కేటాయించి ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. పదేళ్ల కాల పరిమితి రానున్న మార్చి నెలలో ముగుస్తున్నందున చట్టాన్ని పొడిగించాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఝాన్సీ, శ్రీలక్ష్మి, పుష్పరాజు, చంద్రరావు, నాగరాట్నాలు, రాజశేఖర్, ఏసురత్నం, వీర్రాజు, రమేష్, నానిబాబు పాల్గొన్నారు. అనంతరం కొట్టు సత్యనారాయణకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇళ్ల పట్టాల అందజేత

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరులో పేదల ఇళ్ల స్థలాల కోసం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలోని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన భౌతిక హద్దులను ఏర్పాటు చేసి వారికి పట్టాలను అందజేశారు. వేల్పూరులోని కావలిపురం రోడ్డులోని లేఅవుట్‌లో ఆదివారం మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వారి స్థలాలకు సంబంధించిన హద్దులను చూపించి, పట్టాలను అందజేశారు. ఈసందర్భంగా పోలేపల్లి వెంకటప్రసాద్ మాట్లాడుతూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. ఈకార్యక్రమంలో వేల్పూరు సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, ఎంపీటీసీలు చుంద్రు శ్యామలా రత్నకుమారి, రెడ్డి హైమా, విజయ దుర్గ, కత్తుల జస్పాల్, పంచాయతీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మవారికి వెండి సమర్పణ

తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలంబపురం ముత్యాలమ్మవారి వెండి చీరకు అడపా ఆకుల శేషగిరిబాబు – ఉషశ్రీ దంపతులు రెండు కిలోల వెండిని సమకూర్చారు. ఈ వెండిని జూనియర్ అసిస్టెంట్ హరిబాబుకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల హరేరామ్‌ప్రసాద్ అమ్మవారికి 40కిలోల వెండితో చీర తయారీకి దాతలు ముందుకొచ్చి వెండిని అందించాలని పిలుపునిచ్చారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేరిచర్ల ఫౌండేషన్ ఆవిర్భావ వేడుకలను అధ్యక్షుడు పేరిచర్ల మురళీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని బృందావనం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, నాయకులు యెగ్గిన నాగబాబు, డైమండ్స్ క్లబ్ అధ్యక్షులు కోనా హనుమాన్, లియో క్లబ్ సభ్యులు, వాకర్స్ సభ్యులు, బీజేపీ నాయకులు, యువత పాల్గొన్నారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు



పైడిపర్రులో జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సమక్షంలో కేకు కట్ చేస్తున్న చైర్మన్ చీర్ల పద్మశ్రీ



వేల్పూరు చర్చిలో ప్రార్థనలలో పాల్గొన్న మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు

తణుకు టౌన్: నూతన సంవత్సర వేడుకలను మండల వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. పైడిపర్రులోని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ, పార్టీ పరిశీలకుడు చీర్ల రాధయ్య కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని వివిధ గ్రంథాలయాలకు చెందిన సిబ్బందితో పాటు తణుకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తణుకు రూరల్‌మండలం వేల్పూరులోని మండలపార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడపాటి వీర్రాజు, తదితరుల సమక్షంలో నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరమల్ల ఫణీంద్ర, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, మండల యూత్ అధ్యక్షుడు మణికంఠ, దాట్ల సుందరరామరాజుతో పాటు మండలంలోని పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

చర్చిలలో..

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తణుకు మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున చర్చిలలో క్రైస్తవ విశ్వాసులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెల్పుతూ ఉత్సాహ గీతాలు పాడుతూ చర్చిలలో గడిపారు. ఆదివారం ఉదయం వివిధ ప్రార్థనాల మందిరాల్లో నూతన సంవత్సర ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని ఆర్‌సీఎం చర్చి, లూథరన్ చర్చి, జీడీఎం చర్చి, పెంతుకోస్తు చర్చి, బైబిల్ మిషన్, తదితర చర్చిల ఆధ్వర్యంలో నూతన సంవత్సర ప్రార్థనా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేల్పూరులో ఏసు సేవా కేంద్రం, హల్లేలూయ గ్రౌండ్‌లో నిర్వహించిన నూతన సంవత్సర ఆరాధన కార్యక్రమాల్లో మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి హైమా, చుంద్రు శ్యామల, విజయ దుర్గ, కత్తుల జస్పాల్, వెంకటలక్ష్మి, సొసైటీ డైరెక్టర్ కనక మహాలక్ష్మి పాల్గొన్నారు. మండలంలోని మండపాక, కొమరవరం, తేతలి, దువ్వ, ముద్దాపురం, కోనాలలోని చర్చిలలో నూతన సంవత్సర ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు.



తణుకులో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి కారుమూరి దంపతులు



అత్తిలిలో కూసంపూడి పెదకాపు పార్కులో కేకు కట్ చేస్తున్న దృశ్యం

అత్తిలిలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

అత్తిలి: మండలంలో నూతన సంవత్సర వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పిల్లలు, యువకులు, పెద్దలు అర్ధరాత్రి వరకూ సంబరాలు చేశారు. అత్తిలి మండలంలోని గ్రామాల్లో పలుకూడళ్ల వద్ద 12 గంటలు దాటగానే కేకులు కట్‌చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మహిళలు ఇళ్ల ముంగిట రంగవల్లులను సుందరంగా తీర్చిదిద్దారు. యువత డీజే సాంగ్స్‌తో డ్యాన్స్‌లు చేస్తూ హుషారుగా గడిపారు. అత్తిలి బస్‌స్టేషన్ సమీపంలోని కూసంపూడి పెదకాపు పార్కులో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కూసంపూడి పెదకాపు కుమారుడు కూసంపూడి మూర్తి కేకు కట్ చేసి స్థానిక ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చినపేటకు చెందిన యువత ఆనందోత్సాహాల నడుమ వేడుకలలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి కారుమూరి దంపతులు

తణుకు అర్బన్: ముక్కోటి మహోత్సవాల్లో భాగంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసియున్న స్వామివారిని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, లక్ష్మీకిరణ్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ అర్చకులు మంత్రి కారుమూరి దంపతులను పూర్ణకుంభంతో స్వాగతంపలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ చైర్మన్ కొత్తపల్లి రామచంద్రరావు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



కృష్ణాపురంలో పెంచిన పింఛన్లు అందజేస్తున్న జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు



అత్తిలిలో పింఛన్ సొమ్మును లబ్ధిదారుడికి అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో ఒకటో తేది ఆదివారం పింఛన్ల పంపిణీ శరవేగంగా సాగింది. మొత్తం 12,051మంది వివిధ రకాల పింఛన్‌దారులు ఉన్నారు. కొత్తగా మరో 362 పింఛన్లు మంజూరయ్యాయి. కొత్తగా మంజూరైనవి మినహా పాత పింఛన్ల పంపిణీ ప్రక్రియను దాదాపు 89 శాతం పూర్తిచేశారు. కొత్తగా పెంచిన రూ.250 కలుపుకుని ఒక్కొక్కరికీ రూ.2750 చొప్పున పింఛన్ సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణాపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ క్రమంలోనే ఇచ్చిన హామీ మేరకు రూ.2750 పింఛన్ అందించారన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కట్టా రంగబాబు, సూర్పని రామకృష్ణ, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, సర్పంచ్‌లు చీకట్ల పుష్పలక్ష్మీకుమారి, రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ఉప సర్పంచ్ మేణ్ణి రామారావు, అడపా హరిబాబు, ఆరుగొలను శ్రీను, రాపాక వెంకటేశ్వరరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కొల్లా విజయలక్ష్మి, నార్పిరెడ్డి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి టి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కోలాహలంగా పింఛన్ల పంపిణీ

అత్తిలి: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెంచిన పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేస్తున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. ఆదివారం అత్తిలిలో ఆయన వలంటీర్లతో కలిసి పింఛన్ సొమ్మును పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పైబోయిన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటివద్దకే అందజేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లతో పాటు సచివాలయ కన్వీనర్లు కలిసి పింఛన్ సొమ్మును అందజేసారు. వార్డు సభ్యుడు గారపాటి నాగరాజు, సచివాలయ కన్వీనర్ పైబోయిన శ్రీనివాస్, వలంటీర్స్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయంగా పింఛను పంపిణీ చేసిన మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఇచ్చిన మాటను నిలబెట్టుకునే మంచి మనసున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు సజ్జాపురంలో పెంచిన పింఛను సొమ్మును ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు మంత్రి కారుమూరి స్వయంగా లబ్ధిదారులకు పింఛను సొమ్ము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛను పెంచుతానని ఇచ్చిన హామీ ప్రకారం రూ.2,750 పెంచారని తెలిపారు. ఈ సందర్భంగా పింఛను సొమ్ముతో పాటు స్వీటు ప్యాకెట్‌ను కూడా లబ్ధిదారులకు మంత్రి కారుమూరి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తణుకు పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు గుబ్బల సూర్యచంద్రరావు, జి.సూర్యనారాయణరెడ్డి, శెట్టి శాంతకుమారి, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న కర్రి భాస్కరరావు, విజయలక్ష్మి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, ఏపీ రాష్ట్ర క్రీడల డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని 10వ వార్డులో ఆదివారం వైఎస్సార్ పింఛను కానుకను వృద్ధులకు, వితంతులకు భాస్కరరావు, విజయలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. కర్రి భాస్కరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేశారని కొనియాడారు. పెంచిన పెన్షన్ సొమ్ము రూ.2,750 లబ్ధిదారులకు అందజేసినట్టు తెలిపారు. ఇన్‌చార్జి అద్దాల నరసింహారావు, వెల్ఫేర్ సెక్రటరీ అన్నపూర్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పెనుగొండ ఆంజనేయులు, కాకర్ల రాజీవ్, మాధవి, కె.శ్రీనివాస్, వెంకట లక్ష్మి, దుర్గ, కుమారి, గణపతి, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పెన్షన్లు అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 14వ వార్డులో పెంచిన ప్రభుత్వ పెన్షన్లను వార్డు ఇన్‌చార్జిలు మిద్దే ఆదినారాయణ, నీరుకొండ పండులు ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు, మహిళలకు అందజేశారు. కన్వీనర్ జ్యోతి పాల్గొన్నారు.

అమ్మవార్ల జాతరలు ప్రారంభం



దర్శిపర్రులో పూజలందుకుంటున్న పుంతలో ములసమ్మ అమ్మవారు

పెంటపాడు: నూతన సంవత్సరం పురస్కరించుకొని నియోజకవర్గంలో సందడి నెలకొంది. దర్శిపర్రు గ్రామ దేవత పుంతలో ముసలమ్మ ఆలయం వద్ద 5 రోజులపాటు నిర్వహించనున్న జాతరను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బంధువుల హడావుడి నెలకొంది. జాతర ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.

పలు గ్రామాల్లో అమ్మవారి ఆలయాల వద్ద పూజలు

ఆకుతీగపాడులో గ్రామ దేవత ముత్యాలమ్మ ఉత్సవాలకు సంబంధించి ప్రత్యేక పూజలు చేసారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కోరిమిల్లిలో గ్రామ దేవత కట్లమ్మ అమ్మవారు, రావిపాడులో వెంకయ్యకాలువగట్టున వేంచేసియున్న ముళ్లమ్మ అమ్మవార్ల ఆలయాలను ఉత్సవాలకు ముస్తాబు చేసారు. అలంపురంలో రజకచెరువు వద్ద ముళ్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. జట్లపాలెం పారుపల్లి అమ్మవారు, పెంటపాడులో గ్రామదేవతలైన పెంట్లమ్మ అమ్మవారు, పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయం, ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాల వద్ద ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పలువురికి అభినందన

నూతన సంవత్సరం పురస్కరించుకొని మండలంలో పలువురు గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులకు కార్యకర్తలు, గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానాలు చేసారు. జట్లపాలెంలో పార్టీ బీసీ సంఘ నాయకులు కట్టుబోయిన కృష్ణప్రసాద్, ఆకుతీగపాడులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, ప్రత్తిపాడులో పార్టీ సీనియర్ నాయకులు వీర్ల గోవింద్, కోరిమిల్లిలో మాజీ సర్పంచ్ వల్లూరి బ్రహ్మానందం, మీనవిల్లూరులో సర్పంచ్ దంపతులు చింతపల్లి లక్ష్మి, శ్రీనివాసరావు, పెంటపాడులో పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి భాస్కరరెడ్డి తదితరులను ఆయా గ్రామాల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

పుంతలో ముసలమ్మ ఆలయంలో విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సీతారాంపేట–కొబ్బరితోటలో వేంచేసియున్న పుంతలో ముసలమ్మ తల్లి 40వ వార్షిక మహోత్సవాలు సందర్భంగా యువఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మహిళలు, భక్తులు లలితా సహస్ర పారాయణం నిర్వహించారు. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు రాజా త్రినాథ్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈతకోట తాతాజీ, నరిసే సోమేశ్వరరావు, అయినం బాలకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరంలో శుభాలు కలగాలి



ఉపముఖ్యమంత్రి కొట్టుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ కార్యకర్తలు, నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్: 2023 సంవత్సరం ప్రజలందరికీ శుభాలు కలగాని, అందరూ సంతోషంగా సంక్షేమంతో ముందుకు సాగాలని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో జనవరి 1 సందర్భంగా ఆదివారం నిర్వహించిన వేడుకల్లో పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని మంత్రి కొట్టుకు, వైఎస్సార్‌సీపీ నేత కొట్టు విశాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ఉదయం విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్, జగన్‌మోహన్‌రెడ్డిని, రాష్ట్ర గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వారికి తిరుమల తిరుపతి, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం వేదపండితులతో వేదమంత్రాలను, ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయానికి చేరుకొని పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులను కలిశారు.

భూగర్భ డ్రెయినేజీకి రూ.100 కోట్లు

రోడ్లు, తాగునీరును అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సీవరేజ్ ట్రీట్‌మెంటు ప్లాంట్ నిర్మాణాన్ని వేగవంతంగా నిర్మిస్తున్నామన్నారు. భూగర్భ డ్రెయినేజీ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రూ.100 కోట్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం విజయరాజు, అసిస్టెంట్ కమిషనర్ సుబ్రహ్మణ్యం, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ఏడీఏ మురళీకృష్ణ, పట్టణంలోని పలువురు ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, మంత్రిని, యువనేత కొట్టు విశాల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర కార్మిక చైతన్య యాత్ర జాతరకు స్వాగతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భీమవరంలో నిర్వహించనున్న సీఐటీయూ 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్ర కార్మిక చైతన్య యాత్ర జాత ఇచ్ఛాపురంలో డిసెంబర్ 28న ప్రారంభం కాగా చైతన్య యాత్ర జాత ఆదివారం తాడేపల్లిగూడెం చేరుకుంది. ఈ యాత్రకు సీఐటీయూ పట్టణ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రఅధ్యక్షుడు సీహెచ్ నరశింగరావు, ఉపాధ్యక్షురాలు బేబీరాణి, కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, ఎస్.రమణారావు, జవ్వాది శ్రీను పాల్గొన్నారు.

కార్పెంటర్ సేవా ట్రస్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ

తణుకు టౌన్: విశ్వకర్మ వడ్రంగి పనివారల సంక్షేమ సంఘం, తణుకు పట్టణ కార్పెంటర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఆదివారం తణుకులోని కార్పెంటర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘం సర్వ సభ్య సమావేశానికి పట్టణ అధ్యక్షుడు కలగర్ల శేషగిరిబాబు అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంపటాపు శ్రీమన్నారాయణ, గోడి నాగబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సేవా ట్రస్ట్‌కు తణుకు పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీ కృష్ణ టింబర్ డిపో అధినేతలు రూ. 9,116 విరాళం అందజేసినట్లు అధ్యక్షుడు శేషగిరిబాబు తెలిపారు. టింబర్ డిపో అధినేతలు నమ్మి వాసు, సతీష్‌తో పాటు కార్పెంటర్ సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కొప్పోజు కొండబాబు, కోశాధికారి చిక్కాల సూర్యనారాయణ, గోడి లీలా బాలాజీ, మహ్మద్ జిలానీ, రాజేశ్వరి పాల్గొన్నారు.

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

పెంటపాడు: గూడెం నియోజకవర్గంలోని పలు ప్రార్థనా కేంద్రాలు, చర్చిలలో నూతన వత్సరానికి స్వాగతం పలుకుతూ ఘనంగా ప్రార్థనలు నిర్వహించారు. గూడెం టౌన్ ఎక్లాస్ లూథరన్ చర్చిలో గురుమండల అధ్యక్షుడు కె. విజయరాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గూడెం ఫెయిత్ చర్చిలో రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సేవకురాలు సుస్మిత ఆనంద్, పలు సంఘ పాస్టర్లు, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముదునూరుపాడు స్వస్థత శాలలో, గూడెంలోని అనురాగ స్వస్థత శాల, కల్వరి బైబిలు మిషను తదితర చర్చిలలో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బీవోసీ నిధులను కార్మిక సంక్షేమానికి వెచ్చించాలి



జగన్నాథపురంలో సమావేశంలో మాట్లాడుతున్న ఇఫ్టూ జిల్లా నాయకుడు మామిడి దానవరప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: కార్మికుల సంక్షేమానికి బీవోసీ బోర్డు నిధులను వెచ్చించాలని ఇఫ్టూ జిల్లా నాయకుడు మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని జగన్నాథపురంలో ప్రగతిశీల భవన నిర్మాణకార్మిక సంఘం (ఇఫ్టూ) జనరల్‌బాడీ సమావేశం తులా దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మామిడి దానవరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి ఏడు నెలల నుంచి ఏ విధమైన గృహ రుణాలు ఇవ్వకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అర్థాకలితో జీవిస్తున్నారని, తక్షణమే ప్రభుత్వం ఇచ్చే ఇళ్లకు రుణం వెంటనే మంజూరు చేయాలని, బిల్డింగ్ మెటీరియల్ రేట్లు తగ్గించాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు చేయాలని, 60 ఏళ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు బీవోసీ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎం.సత్తిపండు, నీలం సత్తిబాబు, టి.సురేష్, తోట సూర్యనారాయణ, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ధనరాజు, రాంబాబు, కృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం
90102 23729
90100 68395
63097 62918
తణుకు
90108 43311
90100 51493
Office mail : tpgadvt@gmail.com